క్లుప్తంగా

బాలికలను చదివించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ మహాలక్ష్మీ

దాచేపల్లి : బాలికలు ఉన్నతమైన చదువులు చదవాలని ఎంపీడీఓ వై. మహాలక్ష్మీ అన్నారు. జాతీయ బాలిక దినోత్సవాన్ని స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్, నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మహాలక్ష్మీ మాట్లాడుతూ.. బాలికలను పనులకు పంపించకుండా బడికి పంపించి ఉన్నతమైన చదువులు చదివించాలని కోరారు. కిశోర బాలికలకు బాల్య వివాహాలు చేయవద్దని, ప్రభుత్వం ద్వారా వచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకుని చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ టి. చంద్రశేఖర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సీహెచ్. వరలక్ష్మీకుమారి, ఎల్. శ్రీలక్ష్మీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, అయాలు పాల్గొన్నారు.

ఖబరస్థాన్‌లో అభివృద్ధి పనులు



మట్టి చదును చేస్తున్న జేసీబి

కారెంపూడి: స్థానిక ఖబరస్థాన్(ముస్లిమ్ శ్మశాన వాటిక)లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. అంజుమన్ కమిటీ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ షేక్ ఆరీఫ్ మండల ప్రజా పరిషత్ మంజూరు చేసిన నిధులతో అక్కడ బోరు వేయించి మంచినీటి ట్యాంక్ ఏర్పాటు చేశారు. ఇప్పుడు దాతలు, కమ్యూనిటీ నిధులతో ఖబరస్థాన్ మైదానంలో మట్టి తోలించి గుంతలు పూడ్చి లెవల్ చేయిస్తున్నారు. మొక్కలను పెంచుతూ ఆ ప్రాంతాన్ని సౌకర్యవంతంగా తయారుచేస్తున్నారు. దీంతో చిన్న మసీదు, దాని ముందున్న ఖబరస్థాన్‌కు ఇప్పుడు మంచి లుక్ వచ్చింది. ఒకప్పుడు అసౌకర్యంగా ఉన్న ఈ ప్రాంతం ఇప్పుడు ఆహ్లాదకరంగా మారుతోంది.

నేడు అంతర్జాతీయ ఓటర్ దినోత్సవం

గురజాల : నేడు అంతర్జాతీయ ఓటర్ దినోత్సవం నిర్వహించడం జరుగుతుందని తహసీల్దార్ ఎం దానియేలు సూచించారు. ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ఏలియంపేట కాలనీలో చోరీ

దాచేపల్లి : నగర పంచాయతీ పరిధిలోని ఏలియంపేట కాలనీలో గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం చోరీకి పాల్పడ్డారు. కాలనీలో నివాసం ఉంటున్న కొత్తపల్లి ఏసమ్మ ఇంటి తలుపులను గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువా తాళాలు పగులగొట్టి అందులో భద్రపరచిన రూ 1.50 లక్షల నగదు, సూమారుగా రూ 3.50 లక్షలు విలువ చేసే బంగారం నగలు చోరీ చేసి తీసుకెళ్లారు. స్కూల్ నుంచి మధ్యాహ్నం ఇంటికి వచ్చిన ఏసమ్మ మనవడు చోరీ జరిగినట్లుగా గుర్తించారు. పొలం పనులకు వెళ్లిన అమ్మమ్మ ఏసమ్మకు ఫోన్ ద్వార సమాచారం ఇచ్చాడు. ఇంటికి చేరుకున్న ఏసమ్మ బీరువాలో ఉన్న నగదు, నగలు చోరీ చేసినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలాన్ని సీఐ షేక్ బిలాలుద్దీన్, ఎస్ఐ శివనాగరాజు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రెండు ద్విచక్రవాహనంపై నలుగురు వ్యక్తులు వచ్చి చోరీ చేసినట్లుగా కాలనీవాసులు చర్చించుకుంటున్నారు.

రెండు రోజులు రైలు గేటు మూత

గురజాల : రైల్వే ట్రాక్ మరమ్మతుల కారణంగా రెండు రోజులు పాటు రైలు గేటు మూత వేయడం జరుగుతుందని రైల్వే అధికారులు పత్రికా ప్రకటన విడుదల చేశారు. నడికూడి-మాచర్ల రైల్వే స్టేషన్ మధ్య రెండు రోజుల పాటు మరమ్మతులు చేపట్టనున్నట్లు కావున వాహనదారులు, ప్రయాణికులు సహకరించాలని ప్రకటనలో కోరారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్ట్

గురజాల : చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ అశోక్ బాబు తెలిపారు. వివరాల ప్రకారం ఈ నెల 9వ తేదీన గురజాల పట్టణంలోని బ్రాహ్మణ బజారులో ఓర్సు వెంకటేశ్వర్లు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి వెనుక నుంచి చొరబడి బీరువాలో ఉన్న 50 గ్రాముల బంగారం, రూ.20 వేలు నగదు, సెల్‌ఫోన్‌ను దొంగిలించడం జరిగింది. సీఐ కె ప్రభాకర్ ఘటన స్థలాన్ని పరిశీలించి క్లూస్‌టీం ప్రదేశాన్ని పరిశీలించారు. ఎస్ఐ అశోక్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో కొత్తఅంబాపురం గ్రామానికి చెందిన తూమాటి రాజేష్‌గా గుర్తించడం జరిగిందని, పిడుగురాళ్ల లోని పిల్లుట్ల రోడ్డులో ఉన్నట్లు గుర్తించి ఎస్ఐ అశోక్‌బాబు తన సిబ్బందితో వెళ్లి అదుపులోకి తీసుకుని విచారించగా నిందితుడు రాజేష్ నేరం ఒప్పుకున్నాడు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచినట్లు ఎస్ఐ తెలిపారు.

సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలవాలి

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



పథకాల కరపత్రాన్ని మహిళకు అందజేస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మాచర్ల: దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో అమలు చేయనటువంటి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని రోప్‌వే కాలని, 9వ వార్డుకు చెందిన కౌన్సిలర్ జగన్నాధం శివయ్య, మందా సంతోష్, దాసరి అగ్గిరాముడుల ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నిర్వహించారు. పెద్ద ఎత్తున 9వ వార్డు ప్రజలు మహిళలు, పార్టీ నాయకులు పీఆర్కేకు పూలు చల్లి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్టీ కాలనీలో ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద పీఆర్కే ఆ సంఘ నాయకులతో కలిసి అంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్హులైన లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ప్రభుత్వం నుంచి అందిన సంక్షేమ లబ్ధిని వివరిస్తూ ఈ సందర్భంగా వారిని ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై మంచి స్పందన లభించిందన్నారు. ఆ వార్డుకు చెందిన స్థానికులు కొన్ని సమస్యలను ప్రస్తావించగా పీఆర్కే వాటిని పరిష్కరిస్తామని హామీ నిచ్చారు. వార్డులో 306 మంది లబ్ధిదారులను కలిసి కరపత్రాలను అందజేసి ప్రభుత్వ పథకాలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న నవరత్న పథకాలను, అభివృద్ధి పథకాలను గ్రామ సచివాలయ వ్యవస్థ వల్ల ప్రజలకు అందుతున్న ప్రజా సేవలను, లబ్ధిదారులకు నగదు నేరుగా వారి ఖాతాలోకి జమ అవుతున్న తీరును వివరించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్‌లు జగన్నాధం శివయ్య, మందా సంతోష్, దాసరి అగ్గిరాముడు, మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, మాజీ చైర్మన్ తురక కిషోర్‌తో పాటు వార్డుకు చెందిన వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, రాష్ట్ర కృష్ణ బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ అంజి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉప్పుతోళ్ళ వెంకటేశ్వర్లు, దాసరి నాగేశ్వరరావు, జగన్నాధం కుసరయ్య, రమావత్ బాలునాయక్, దాసరి సుబ్బరాయుడు, దాసరి నాగరాజు, శారం వేణు, వెంకటేశ్వర్లు, దాసరి సుబ్బయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు. వార్డుకు చేరుకున్న సమయంలో వార్డు కౌన్సిలర్లతో పాటు వివిధ వార్డులకు చెందిన కౌన్సిలర్లు పోలా శ్రీను, కో ఆప్షన్ సభ్యురాలు అనంతరావమ్మ, పలువురు ఎస్టీ సంఘ నాయకుల ఆధ్వర్యంలో పీఆర్కేకు జే జేలు పలుకుతూ పూలు చల్లి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ఈవి రమణబాబు, తో పాటు పురపాలక సంఘం సిబ్బంది, సచివాలయ అడ్మిన్‌లు పాల్గొన్నారు.

పలువురు టీడీపీ నేతలు వైఎస్సార్ సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

వెల్దుర్తి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని రచ్చమల్లపాడు గ్రామానికి చెందిన 25 కుటుంబాల వారు మండల పరిషత్ అధ్యక్షులు చింతా శివరామయ్య, పార్లపల్లి పెద గాలయ్యల ఆధ్వర్యంలో గార్లపాటి మల్లయ్య, గార్లపాటి చిన సీతారామయ్య, గార్లపాటి అచ్చయ్య, కురుకందుల కోటయ్య, శ్రీను, నాగయ్య, జానకి శివన్నారాయణ, సావిత్రి, గుమ్మడాల పుల్లయ్య, ఇమ్మడి శ్రీను, చెంచయ్య, కొండు రామారావు, పాందుగుల రామయ్య, లక్ష్మయ్య, పోసాని వెంకటేశ్వర్లు, కొడవటి కర్ల సంజయ్, పిన్నబోయిన చిన రామయ్య, వానరాశి వెంగయ్య, కుమ్మరి శేషమ్మ, పిచ్చమ్మ, రవణ, షేక్ వలియా బి, రంజాన్ బి, మట్టం వెంకమ్మ తదితరులున్నారు. వీరంతా టీడిపిని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. రాష్ట్రంలో 87శాతం కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. మనందరం సీఎం జగన్‌కు మద్దతు పలకాలన్నారు. ఈ కార్యక్రమంలో చింతా ఆదినారాయణ, గార్లపాటి వెంకట్రామయ్య, పిన్నెబోయిన మార్కొండయ్య, రామిరెడ్డి, చిన గాలయ్య, తోట బ్రహ్మయ్య పలువురు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కారెంపూడి: రిపబ్లిక్ డే సందర్భంగా స్థానిక బ్రహ్మనాయుడు జెడ్పీ హైస్కూల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మంగళవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. మొత్తం 90 మంది వివిధ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. ప్రథమ బహుమతిని బ్రహ్మనాయుడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల టీమ్, ద్వితీయ బహుమతిని ఒప్పిచర్ల జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల టీమ్, తృతీయ బహుమతిని మోడల్ స్కూలు విద్యార్థులు గెలుచుకున్నారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

పిడుగురాళ్ల: లారీ ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన పిడుగురాళ్ల పట్టణంలో మంగళవారం జరిగింది. సంఘటనకు సంబంధించి పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన షేక్ రబ్బానీ(26) రాజుపాలెంలో చికెన్ షాపులో పనిచేస్తుంటాడు. రాజుపాలెంలో పని ముగించుకుని పిడుగురాళ్ల పట్టణానికి వస్తుండగా పట్టణంలోని రైల్వే ఒవర్ బ్రిడ్జిపై ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై ఉన్న షేక్ రబ్బానీ అక్కడిక్కడే మృతి చెందాడు. ప్రమాదం తెలుసుకున్న పట్టణ ఎస్ఐ పవన్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పట్టణ ఎస్ఐ పవన్‌కుమార్ దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

సీఐ టి బాలకృష్ణ



భద్రతా వారోత్సవాల సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న సీఐ బాలకృష్ణ

మాచర్ల రూరల్: ద్విచక్ర, ఫోర్ వీల్ వాహనాల పై డ్రైవ్ చేస్తున్న సమయంలో నిర్ణీత వేగాన్ని మించకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రయాణించాలని పట్టణ సీఐ టి బాలకృష్ణ కోరారు. మంగళవారం న్యూటన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో 34వ జాతీయ భద్రతా వారోత్సవాల సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు. వాహనదారులు ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్‌ను పొందాలని, వాహనం నడిపే సమయంలో ఎదుట వాహనాన్ని గమనిస్తూ, తమ వాహనాలను వేగం చూసుకుని నడపాలని సూచించారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తమ పై పెట్టుకున్న ప్రేమ, ఆశలను గుర్తుంచుకుని నడవాలని సూచించారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ శ్రీధర్‌రెడ్డి, కళాశాల కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపల్ జగదీశ్వరరెడ్డిలు పాల్గొన్నారు.

గుండ్లపల్లిలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

నకరికల్లు: పంటలను సిఫారసు మేరకే ఎరువులను వినియోగిస్తే తక్కువ ఖర్చులో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని సహాయ వ్యవసాయ సంచాలకులు బి.శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిత్ర, శత్రు పురుగుల మధ్య తేడాలను రైతులు గుర్తించగలిగే అవగాహన కలిగిఉండాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు. గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

అనుగ్రహ పరిపూర్ణురాలు కానుకమాత

ఫాదర్ జోసఫ్ సాగర్



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఫాదర్లు

రెంటచింతల: పరిపూర్ణమైన హృదయంతో ప్రార్థించిన ప్రతి ఒక్కరిపై అనుగ్రహం కురిపించి వారాలిచ్చే తల్లి కానుకమాత అనుగ్రహ పరిపూర్ణురాలుగా కొనియాడబడుతుందని సాగర్‌మాత చర్చి విచారణ గురువులు రెవ.ఫాదర్ పామిశెట్టి జోసఫ్ సాగర్ అన్నారు. మంగళవారం కానుకమాత చర్చి 173వ మహోత్సవ వేడుకల్లో భాగంగా జోసఫ్ సాగర్ జండాను ఆవిష్కరించారు. అనంతరం కానుకమాత చర్చి విచారణ గురువులు ఏరువ లూర్దుమర్రెడ్డి నేతృత్వంలో పురాతనమైన కానుకమాత దేవాలయం ప్రాంగణంలో సహాయ గురువులు పి.స్లీవారెడ్డి కలిసి నవదిన ప్రార్థనలలో భాగంగా నిర్వహించిన సమష్టి దివ్య పూజాబలిలో ఆయన భక్తులను ఉద్దేశించి వంశ వృక్షంలో మహావృక్షం యోసేపు అనే ధ్యానాంశంపై మాట్లాడారు. సంఘంలో ప్రతి ఒక్కరూ యోసుపు జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. శ్రీసభ కరుణ గల తల్లిగా గుర్తించిన మరియమాతను కుటుంబ సమేతంగా నిత్యం ప్రార్థించినట్లు అయితే ఆ కుటుంబంలో ఎల్లవేళల సుఖసంతోషాలు వెల్లవిరుస్తాయన్నారు. ఈ సమష్టి దివ్య పూజాబలిలో సహాయ గురువులు పి.స్లీవారెడ్డి, మఠకన్యలు, చర్చి పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సోషల్ స్టడీస్ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు మెటీరియల్ అందజేస్తున్న ప్రధానోపాధ్యాయురాలు మిరియమ్మ, బుల్లిబాబు

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని దమ్మాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోషల్‌స్టడీస్ మెటీరియల్‌ను మంగళవారం పంపిణీ చేశారు. జాతీయబాలిక దినోత్సవంలో భాగంగా గ్రామ సచివాలయ సంరక్షణ కార్యదర్శి పి.ఆశాలత సహకారంతో విద్యార్థులకు పంపిణీ చేసినట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కె.బుల్లిబాబు చెప్పారు. లక్ష్యాన్ని ఎంచుకుని సాధన చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.మిరియమ్మ చెప్పారు. విద్యార్థులకు బాలికదినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు నాని తదితరులు పాల్గొన్నారు.

ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానంపై అవగాహన కల్పించాలి

క్రోసూరు: ఓటు కార్డుకు ఆధార్ అనుసంధానం చేసుకునేలా ఓటర్లకు బీఎల్వోలు అవగాహన కల్పించాలని డిప్యూటీ తహసీల్దార్ బి.శ్రీనివాస రావు పేర్కొన్నారు. బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా.. తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో బీఎల్వోలతో సమీక్షా సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ అనుసంధానం మండలంలో 78 శాతం పూర్తి అయ్యిందని, త్వరగా నూటికి నూరుశాతం పూర్తిచేసేలా చూడాలన్నారు. అదేవిధంగా ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని అన్నిపోలింగ్ బూత్‌ల వద్ద బీఎల్వోలు పాల్గొని 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటు గుర్తింపు నమోదు చేయడం, ఓటు హక్కు గురించి తెలియచేయడం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారి పొత్తూరి నాగేశ్వరరావు, బీఎల్వోలు పాల్గొన్నారు.

చర్లగుడిపాడు అంగన్‌వాడీ నోటిఫికేషన్‌ను రద్దు

గురజాల : మండల పరిధిలోని చర్లగుడిపాడు గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు ఖాళీగా ఉందని గత వారం రోజులు క్రితం నోటిఫికేషన్ జారీ చేసియున్నామని కానీ ఆ పోస్టు ఖాళీగా లేదని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ రుక్సానా సుల్తానాబేగం ప్రకటనలో తెలిపారు. కేంద్రం నందు అర్హత కలిగిన అంగన్‌వాడీ సహాయకురాలు ఉండడంతో పదోన్నతిపై వచ్చే అవకాశం ఉందని తెలిపారు. కావున వారం రోజుల క్రితం జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేస్తున్నట్లు తెలిపారు. విషయాన్ని గమనించాలని ఆమె ప్రకటనలో కోరారు.

డొంక స్థలం పరిరక్షణకు చర్యలు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్

కారెంపూడి: స్థానిక గురుకుల పాఠశాల పక్కన ఉన్న సర్ధార్ వల్లభాయ్ పటేల్ డొంక స్థలం పరిరక్షణకు చర్యలు తీసుకున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. డొంక స్థలం ఆక్రమణకు గురైందని డొంక పక్కన పొలం ఉన్న రైతు ముత్యాలంపాటి మల్లిఖార్జునరావు దంపతులు సోమవారం స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ ఆదేశాలతో తహసీల్దార్ మంగళవారం స్థలాన్ని క్షేత్ర పరిశీలన చేశారు. ఫిర్యాదు దారులతో మాట్లాడారు. సర్వే నంబరు 393లో 1.95 ఎకరాల డొంక స్థలం ఉందని, ఈ స్థలం ప్రభుత్వానిదని తెలిపే హెచ్చరిక బోర్డులు ఆ స్థలంలో ఏర్పాటు చేశామని ఎవరైనా ఆక్రమణలకు దిగితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. విచారణలో డీటీ కీర్తిసుధామాధురి, సర్వేయర్ సులేమాన్‌ఖాన్, వీఆర్వో కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

మహిళలకు విద్యద్వారానే ఆర్థికాభివృద్ధి

స్పెషలాఫీసర్ గ్రట్రునాయక్



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న స్పెషలాఫీసర్ గట్రునాయక్



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంపీపీ దాసరి చౌడేశ్వరి



మాచవరకంలో విద్యార్థినిలకు అవగాహనా కల్పిస్తున్న వైద్య సిబ్బంది

మాచర్ల రూరల్: విద్య ద్వారానే ఆర్థిక అసమానతలు తొలగి ఉన్నత స్థానంలో నిలిచేందుకు దోహదపడుతుందని మండల స్పెషలాఫీసర్ గట్రునాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని 7వ మైలు గిరిజన పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఉన్నత విద్యద్వారా మన దేశంలో మహిళలు దేశ అధ్యక్ష, ప్రధాని, ముఖ్యమంత్రి పీఠాలు అధిరోహించటమే కాకుండా అంతరిక్ష పరిశోధనలోనూ మహిళలు దూసుకుపోతున్నారని, నేటి బాలలే రేపటి భావి భారత ఉన్నత శిఖరాలలో నిలుస్తున్నారనడంలో సందేహం లేదన్నారు. తల్లిదండ్రులు తమ ఆడపిల్లలను ఖచ్చితంగా చదివించి వారి ఉన్నత అభివృద్ధికి దోహదపడాలని చదువు ద్వారానే వారి ఆర్థికాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. అనంతరం తాళ్ళపల్లి సచివాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ వేముల నాగయ్య, వైద్యులు వెస్లి, ఈఓపీఆర్‌డి కోటేశ్వర రావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లీలావతి, పంచాయితీ కార్యదర్శి ఆవుల వెంకట్రామయ్య, సర్పంచ్ జూకూరి వెంకట్రామయ్యలు పాల్గొన్నారు.

జాతీయ బాలికల దినోత్సవం

పిడుగురాళ్ల: విద్యలో వినూతన మార్పులు తీసుకుని వచ్చి, బాలికలు సగర్వంగా సమాజంలో నిలబడేలా చేసిన వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని 6వ వార్డు కౌన్సిలర్ అజ్మీర శారద అన్నారు. పట్టణంలోని 6వ వార్డులోని 4వ సచివాలయంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడిలో బాలికలు ఇబ్బందులు పడుతున్నారని వారికి నాడు నేడు ద్వారా అన్ని సౌకర్యాలు కల్పించాలరన్నారు. అదేవిధంగా దిశా చట్టాని తీసుకొని మహిళలకు మరింత భరోసా కల్పించారని ఆమె తెలియజేశారు. కార్యక్రమంలో సీడీపీఓ మేరి జోష్న, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది తదిరతులు ఉన్నారు.

విద్యార్థినులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి

మిట్టగుడిపాడు(రెంటచింతల): విద్యార్థుల భవిష్యత్ తరగతి గదుల్లోనే నిర్ణయించబడుతుందనే విషయాన్ని గమనించి ప్రతి విద్యార్థిని పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. మంగళవారం మండలంలోని మిట్టగుడిపాడు గ్రామ శివారులోని కస్తూర్బాపాఠశాలలో నిర్వహించిన జాతీయ బాలికల దినోత్సవం వేడుకల్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థినులు ప్రగతిలో వెనుకబడడానికి గల కారణాలను తల్లి దండ్రులు ఎప్పటికప్పుడు టీచర్లతో చర్చించడం ఎంతో మంచిదన్నారు. ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి అనేక పథకాలను అమలు చేస్తూ విశేషంగా కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఐ.వెంకటేశ్వర్లు, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి, రాష్ట్ర రీసోర్స్ పర్సన్ సృజన, ఈఓపీఆర్డీ రామచంద్రరావు, ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ యరమాల జయంతి, అంగన్వాడీ సూపర్ వైజర్ మహాలక్ష్మి, ఉపాధ్యాయినిలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను కాపాడుకుందాం

మాచవరం: ఆడపిల్లలను చదివించుకుంటూ ఆరోగ్యంతో పాటు వారిని కాపాడుకుందామని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పీహెచ్ఎన్ చిన్నారి రోజా అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లోని పాఠశాలల్లో జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ర్యాలీ చేపట్టారు. పది నుంచి 19 వయస్సు గల బాలికలను రక్షించుకుందాం, గౌరవంగా చదివించుకుంటూ, వారి ఆరోగ్యాన్ని కాపాడుకుందామని ప్లెకార్డులు ప్రదర్శించారు. ఆడపిల్లల రక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఆశావర్కర్లు ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గురజాలలో..

గురజాల : బాలికల పట్ల లింగా వివక్ష వహించరాదని సూపర్‌వైజర్ వై రత్నకుమారి సూచించారు. నగర పంచాయతీలోని 9వ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ బాలిక దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సంతాన సుబ్రహ్మణేశ్వర స్వామి

పిడుగురాళ్ల: పట్టణంలోని నాగుల గుడి దేవస్థానంలో వేంచేసియున్న శ్రీ సంతాన సుబ్రహ్మణేశ్వ ణేశ్వర స్వామివారికి మంగళవారం వివిధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తుల దర్శనార్థం ఉంచారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

26న రైతు సంఘం ర్యాలీ



ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

పిడుగురాళ్ల: కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం వ్యవసాయానికి నష్టం చేసే మూడు నల్ల చట్టాలు తెచ్చిన నేపథ్యంలో 500 రైతు సంఘాల సమన్వయ కమిటీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సంత్సరం పాటు జరిగిన రైతాంగ వీరోచితంగా పోరాటం ఫలితంగా మూడు నలల చట్టాలను రద్దు చేయడం జరిగిందని సీఐటీయూ మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు తెలియజేశారు. పట్టణంలోని మాచర్ల బస్టాండ్ సమీపంలో రైతు సంఘాల రుణ విమోచన చట్టం రైతు ర్యాలీని జయప్రదం చేయాలని వాల్ పేపర్‌ను విడుదల చేశారు. రైతు పండించిన అన్ని రకాల పంటలకు గిట్టుబాటు ధర కల్పింస్తానని చనిపోయినటువంటి రైతులకు నష్టపరిహారం ఇస్తానని, సమ్మె సందర్భంగా పెట్టినటువంటి కేసులను ఎత్తివేస్తానని తదితర ఇచ్చినటువంటి హామీలను తుంగలో తొక్కిన నేపథ్యంలో ఈ నెల 26వ తేదీన నర్సరావుపేటలోని గిట్టుబాటు ధర కల్పించాలని రుణ విమోచన చట్టం తీసుకొచ్చి రైతుకునన అన్ని రకాల అప్పులను రద్దు చేయాలని రైతు ఉద్యమం సందర్భంగా చనిపోయినటువంటి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు గడ్డం కోటేశ్వరరావు, రైతులు గుదే పూర్ణయ్య, వెంకటేశ్వర్లు, మేకల కాటంరాజు, ముప్పాళ్ల వెంకటేశ్వర్లు, శివరాం, కోటేయ్య, వెంకటేశ్వరరెడ్డి, బత్తుల వెంకటేశ్వర్లు, శ్రీను తదితరులు ఉన్నారు.

వృద్ధాశ్రమంలో న్యాయవిజ్ఞాన సదస్సు



వినుకొండ (నూజెండ్ల): స్థానిక మండల లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్, వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి ఎ.తౌషిద్ హుస్సేన్ ఆదేశాలతో వినుకొండ పట్టణంలోని వెల్లటూరు రోడ్డులో గల గుమ్మడి వృద్ధాశ్రమంలో న్యాయవిజ్ఞాన సదస్సును బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఆరె సామ్రాజ్యం అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ తల్లిదండ్రులు, వృద్ధుల సంక్షేమం, రక్షణ చట్టం గురించి వృద్ధులకు తెలియజేశారు. అనంతరం వృద్ధులకు బ్రెడ్ పంపిణీ చేశా రు. కార్యక్రమంలో న్యాయవాదులు కర్నాటి చెన్నకేశవరెడ్డి, రమణారెడ్డి, చిరంజీవి, నాగరాజు, కోర్టు సిబ్బంది, ఆశ్రమం నిర్వాహకులు గుమ్మడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.